నిరీక్షణ ఫలించింది..!

ఎట్టకేలకు తూర్పు నియోజకవర్గంలో జోనల్ కార్యాలయం

- ఇప్పటి వరకు జోన్ – 2 పరిధిలో 5, జోన్ – 3లో 9, జోన్ – 4లో ఒక వార్డు
- వేర్వేరు నియోజకవర్గాల్లోని కార్యాలయాలకు వెళ్లలేక ప్రజలకు అవస్థలు
- జోన్ల పునర్వ్యవస్థీకరణకు అధికారుల సన్నాహాలతో తీరనున్న వెతలు

ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఎట్ట కేలకు జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారని తెలుస్తోంది. జీవీఎంసీ జోన్ల పున ర్వ్యవస్థీకరణకు అధికారులు సన్నాహాలు చేస్తు న్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గం ఒక యూనిట్‌గా జోన్ ఏర్పాటు చేయాలని ప్రాథమి కంగా నిర్ణయించారు. దీని ప్రకారం తూర్పు నియో జకవర్గంలో ప్రత్యేకంగా జోన్ ఏర్పాటు కానుంది. దీంతో ఇంతవరకు దూర ప్రాంతంలో ఉన్న జోనల్ కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవా రిమని, ఇక నుంచి ఆ అవస్థలు తప్పుతాయని స్థాని కులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే జోన్ కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేస్తారో అనే విష యంలో స్పష్టత లేదు. జీవీఎంసీకి నియోజకవర్గం పరిధిలో అన్ని వార్డుల ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా విశాలమైన భవనం, సొంత ఖాళీ స్థలం ఎక్కడ ఉన్నాయో అనేదానిపై అధికారులు ఆలోచనలో పడినట్లు సమాచారం.

నియోజకవర్గంలో 15 వార్డులు

తూర్పు నియోజకవర్గంలో 15 వార్డులున్నాయి. జీవీఎంసీ 9 నుంచి 13 వరకు, 15 నుంచి 23 వరకు వార్డులతోపాటు 28వ వార్డు ఉన్నాయి. ఇవన్నీ ఇప్పటి వరకూ మూడు జోన్‌లలో ఉన్నాయి. 9 నుం చి 13వ వార్డు వరకు జీవీఎంసీ జోన్ – 2లో, 15 నుంచి 23వ వార్డు వరకు జోన్ – 3, 28వ వార్డు జోన్ – 4 పరిధిలో ఉన్నాయి. ఈ మూడు జోన్లలో ఏదీ నియోజకవర్గంలో లేకపోవడం విశేషం. ఏ అవ సరమొచ్చినా 15 వార్డుల ప్రజలు వేర్వేరు నియో జకవర్గాల పరిధిలో ఉన్న జోనల్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం నియోజవర్గాన్ని ఒక జోన్‌గా చేసి అందులోనే కార్యాలయం ఏర్పాటు చేయనుండటంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు సుల భతరంగా అందనున్నాయి.


ముడసర్లోవ వద్ద ఖాళీగా ఉన్న జీవీఎంసీ భవనం (పాత స్కిల్ డెవలప్‌మెంట్ భవనం)

నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచీ సమస్యే

తూర్పు నియోజకవర్గం 2009లో ఏర్పాటైనప్పటి నుంచి వార్డుల్లో ప్రజలకు దూర ప్రాంతాల్లో ఉన్న జోనల్ కార్యాలయాలు సమస్యగా మారాయి. నియోజకవర్గంలో 9 నుంచి 13 వరకు, 15 నుంచి 23 వరకు, 28 వార్డు ఉన్నాయి. వాటిలో 9 నుంచి 13 వరకు వార్డుల (విశాలాక్షినగర్, జోడుగుళ్ల పాలెం నుంచి ఆరిలోవ, పైనాపిల్‌కాలనీ వరకు) ప్రజలు భీమిలి నియోజకవర్గం పరిధి మధురవా డలో ఉన్న జోన్ – 2 కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుంది. 15 నుంచి 23 వరకు వార్డుల (వెంకోజీ పాలెం, ఎంవీపీ కాలనీ, అప్పూఘర్, జాలారిపేట, పెదవాల్తేరు, చినవాల్తేరు, ఇసుకతోట, మద్దిల పాలెం తదితర ప్రాంతాలు) ప్రజలు ఉత్తర నియో జకవర్గంలో ఉన్న జోన్ – 3 కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. 28వ వార్డు ప్రజలు దక్షిణ నియోజకవర్గం పరిధిలో ఉన్న జోన్ – 4 కార్యాల యానికి వెళ్లాల్సి వస్తోంది. ఆ జోన్ కార్యాల యాలన్నీ ఆయా వార్డుల ప్రజలకు దూరంగా ఉన్నాయి. ఇప్పుడు వాటన్నింటికీ ఒకేచోట జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఎక్కడైతే అందుబాటులో ఉంటుందంటే...

నియోజకవర్గంలో అన్ని వార్డుల ప్రజలకు అం దుబాటులో ఉండేవిధంగా జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయాల్సి ఉంది. దీన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలి..?, ఇప్పటికే జీవీఎంసీకి చెందిన భవనాలు ఎక్కడెక్కడ ఉన్నాయి..?, లేదంటే కొత్త భవనాలు నిర్మించడానికి జీవీఎంసీ స్థలాలు అను కూలంగా ఎక్కడ ఉన్నాయి..? తదితర వాటి గురిం చి అధికారులు ఆలోచనలో పడ్డారు. ఇందులో భాగంగా ముడసర్లోవ వద్ద జీవీఎంసీ నిర్మించిన ఖాళీగా ఉన్న భవనం జోనల్ కార్యాలయానికి అన కూలంగా ఉంటుందని పలువురు అధికారులతో పాటు స్థానికులు భావిస్తున్నారు. ఇక్కడ సుమారు 2 ఎకరాల స్థలంలో రూ.6 కోట్ల నిధులతో 2009లో జీవీఎంసీ అధికారులు జోనల్ కార్యాలయం పేరుతో ఈ భవన నిర్మాణం చేపట్టారు. 2013లో నిర్మాణం పూర్తయినప్పటికీ జోన్ కార్యాలయం ఏర్పాటు చేయకుండా ఖాళీగా వదిలేశారు. కొన్నాళ్లు దీన్ని హెచ్‌పీసీఎల్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వ హణకు లీజుకు ఇచ్చేశారు. ఆ లీజు సమయం కూడా ముగిసిన అనంతరం సుమారు రెండేళ్ల నుం చి ఈ భవనం ఖాళీగా నిరుపయోగంగా ఉంది. విశాలమైన ఈ భవనం జోనల్ కార్యాలయానికి అనుకూలమైందని పలువురు భావిస్తున్నారు. అధి కారులు ఆ దిశగా ఆలోచిస్తే ప్రత్యేకంగా ప్రజాధనం ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదని పలువురు అంటున్నారు.

కౌమార దశపై అవగాహన అవసరం


నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మాట్లాడుతున్న సీడీపీవో నీలిమ

ఆరిలోవ: కౌమార దశపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో నీలిమ సూచించారు. జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి నెహ్రూనగర్ అం గన్‌వాడీ కేంద్రం ఆవరణలో బాలికలకు కౌమార దశపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరీ బాలికలకు కౌమార దశ కీలకమన్నారు. ఈ దశలో బాలికలు చదువులో రాణించే విధంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరమన్నారు. రక్తహీనత పట్ల వారికి అవగాహన కల్పించాలన్నారు. 18 సంవత్స రాలు నిండిన బాలికలు శారీరక, మానసిక స్థిరత్వం కలిగి ఉంటారన్నారు. యుక్త వయసు వచ్చినంత వరకు వివాహం చేసుకోకూడదన్నారు. కార్యక్రమం లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సెల్వియా, కార్యక ర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి రాక నేడు

ఎంవీపీ కాలనీ : ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ డిపార్ట్‌మెంట్ ముఖ్య కార్యదర్శి చిరంజీవ్ చౌదరి ఈ నెల 23న విశాఖలో పర్యటించనున్నారు. 23న ఉదయం 8 గంటలకు విశాఖ చేరుకుని పలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ప్రతినిధులతో సమావేశమవుతారు. 24న ఉదయం అమరావతి తిరిగి వెళ్లిపోతారు.

క్లుప్తంగా

శాకంబరిగా విజయదుర్గాదేవి


కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించిన విజయదుర్గాదేవి

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి హనుమంతవాక వద్ద విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మ వారిని శ్రావణ శుక్రవారం సందర్భం గా శాకంబరిగా అలం కరించారు. ఇక్కడి ఆలయ నిర్వాహకులు, అర్చకులు అమ్మ వారిని గోంగూర, తోటకూర, పాలకూర తదితర ఆకు కూరల తోపాటు టమోటా, వంకాయలు, కేరెట్, దొండ, బెండకాయలు, కాకర, క్యాప్సికం, నిమ్మకాయలు, మొక్కజొన్న పొత్తుల దండలతో అలంకరించారు. దీంతో అమ్మవారు శాకంబరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విజయదుర్గాకాల నీ, హనుమంతవాక, క్రాంతినగర్, సంజ యగాంధీకాలనీ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శిం చుకుని పూజలు చేశారు.

పాఠశాలకు స్టౌ వితరణ


సంజీవినగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంకు స్టౌ అందజేస్తున్న గ్రామస్తులు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి సం జీవినగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామంలోని నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో స్టౌ అందజేశారు. ఇక్కడ స్టౌ లేక మధ్యాహ్నం భోజనం వండటానికి ఇబ్బంది పడుతుండడంతో సేవా సంఘం సభ్యులు స్పందించి శుక్రవారం పాఠశాలకు వెళ్లి ప్రధానో పాధ్యాయుడికి స్టౌ అందజేశారు. దీంతో ప్రధా నోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో సంఘ అధ్యక్షుడు నల్ల రవి, కార్యదర్శి నల్ల అప్పారావు, సభ్యులు దుండు కుమార్, మురళి, అప్పారావు పాల్గొన్నారు.

సక్రమంగా చెత్త సేకరించాలి


విశాలాక్షినగర్‌లో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో శుక్ర వారం జోన్ – 2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ పర్యటించారు. వార్డు పారిశుధ్య కార్మికులు ఉదయం విధులకు వెళ్తున్న సమయంలో విశా లాక్షినగర్ వార్డు కార్యాలయం వద్ద ఆయన అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరగాలని సూచించారు. రోజూ కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి వీధుల్లోకి వచ్చే పారిశుధ్య వాహనాలకు అందించాలన్నారు. కార్యక్రమం లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చి న్నాజీ, సచివాల యాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నృత్య పోటీలు



ఆరిలోవ: ప్రపంచ జానపద దినోత్సవం సంద ర్భంగా శుక్రవారం ఆరిలోవలో పాఠశాలల విద్యార్థులకు ఉత్తరాంధ్ర సంగీత జానపద కళా పీఠం ఆధ్వర్యంలో నృత్య పోటీలు నిర్వహిం చారు. టి.ఐ.సి పాయింట్ సమీప భారతి స్కూ ల్‌లో నిర్వహించిన పోటీల్లో ఆరిలోవ ప్రాంతం లోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొ న్నారు. విద్యార్థులు నృత్యం చేస్తూ వారి కళా నైపుణ్యం ప్రదర్శించారు. విజేతలకు నిర్వాహ కులు బహుమతులు అందజేశారు.

రుణాల వసూలుకు వేధించొద్దు

బీచ్‌రోడ్డు : వ్యక్తిగత రుణాల వసూలు కోసం వేధించడం సరికాదని ది లీగల్ సావీ డైరెక్టర్ మండా మానస అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రికవరీ ఏజెంట్ల హింసాత్మక ప్రవ ర్తన, మానసిక వేధింపులు తీవ్రంగా పెరిగాయ న్నారు. నగరంలో శుక్రవారం ఆమె మీడి యాతో మాట్లాడారు. 2024లో రుణ వేధింపు లపై పోలీసులకు వచ్చిన ఫిర్యాదులు 41 శాతం పెరిగాయన్నారు. కేసులు 35,944కు చేరాయన్నారు. నగరాల్లో అధిక కేసులు నమో దయ్యాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలం గాణ రాష్ట్రాల్లో వ్యక్తిగత రుణాలపై డిఫాల్టులు గత ఆరు త్రైమాసికాల్లో అత్యధిక స్థాయికి చేరాయని పేర్కొన్నారు. 'ది లీగల్ సావీ' సంస్థ 11 వేలకు పైగా రుణగ్రహీతలకు రూ.270 కోట్ల విలువైన రుణ పరిష్కారాలను చట్టబద్ధం గా సమన్వయం చేసిందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం


వ్రతంలో భాగంగా పూజలు చేస్తున్న మహిళలు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి ప్రేమ సదన్ మందిరంలో భక్తిశ్రద్ధలతో శ్రీ వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. విశాఖ సిటీ శ్రీ సత్యసాయి సేవా సమితి మహిళా యువ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వ్రతం చేశారు. మహిళా విభాగం సభ్యులు, భక్తులు, బాలవికాస్ గురువులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సంపద, శాంతి, శ్రేయస్సు కోసం సామూహిక ప్రార్థనలు చేశారు. వేదపఠనం, భజనలతోపాటు మంగళహారతి సమర్పణ, భక్తు లకు ప్రసాదం పంపిణీ చేశారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ సమీప సంజీవగాంధీ కాలనీలో గల కనకదుర్గ ఆలయంలో ఆఖరి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వ హించారు. అమ్మవారికి పసుపు, కుంకుమతో అభిషేకం జరిపి, పుష్పాలు, గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలంతా తమ ఇంటిలో పూజలు నిర్వహించుకుని, ఆలయానికి వచ్చి అమ్మ వారికి పసుపు, కుంకుమ సమర్పించారు. అర్చకులు వెంకటరావుశర్మ అభిషేకాలు, అర్చనలు జరిపారు. అనంతరం మహిళలచే సామూహిక కుంకుమార్చన జరిపారు. ఆలయ నిర్వాహకులు సిరిశెట్టి నారా యణరావు, మురళి, సూర్యనారాయణ, సుందర రావు పాల్గొన్నారు.


పసుపు, కుంకుమతో అభిషేకం తర్వాత అమ్మవారు

- కొత్తవెంకోజీపాలెంలోని శ్రీ రామానంద ఆశ్రమం లో గల గౌరీ జ్ఞానలింగేశ్వరాలయ దేవస్థానంలో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ప్రకాశ్ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, భాస్కర్ శర్మ అర్చన, కుం కుమాభిషేకం చేశారు.
- హెచ్‌బీ కాలనీలోని బహుముఖ గాయత్రి ఆల యంలో శుక్రవారం సాయంత్రం లలితా సహస్ర నామ పారయణ చేశారు. గాయత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేణు గోపాల శర్మ ఆధ్వర్యంలో మహిళలు అభిషేకాలు, అర్చనలు చేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మహారాణిపేట: అంతర్జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా మద్దిలపాలెంలోని ఆర్‌ఐవో కార్యాలయం లో విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వ హించారు. ఈ పోటీల్లో పలు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన వారికి జిల్లా స్థాయి పోటీల్లో అవకాశం కల్పిస్తారు. విజేతలకు ఇంటర్మీడియట్ బోర్డు అధి కారులు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నివారణా ధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐవో పి.మురళీధరరావు, జిల్లా ఎయిడ్స్ నియం త్రణ, నివారణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు, జిల్లా సూపర్‌వైజర్ బద్రి, స్వచ్ఛంద సంస్థ మేనేజర్ రవి, సతీష్, వివిధ కళాశా లల అధ్యాపకులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

రెండు ఐవీఎఫ్ సెంటర్ల తనిఖీ

మహారాణిపేట: నగరంలోని పలు ఐవీఎఫ్ కేం ద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, ఇతర సరోగసీ బృందంతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. సంతానోత్పత్తి కేం ద్రాల్లోని ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, స్కానింగ్ మిషన్లను పరిశీలించారు. నోవా ఐవీఎఫ్ కేంద్రం, ఐశ్వర్య ఫెర్టిలిటీ కేంద్రాలను సందర్శించి, అక్కడి పరిస్థితుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసు కున్నారు. ఈ తనిఖీలో డీఎంహెచ్‌వో ఆ కేంద్రాలకు పలు సూచనలు చేశారు. ఆస్పత్రుల్లో ఏఆర్‌టీ కేం ద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయా లేదా అని, వైద్యులు, ఇతర సిబ్బంది విద్యార్హతలను, ల్యాబ్ పరికరాలను పరిశీలించారు. ఈ తనిఖీ బృం దంలో విక్టోరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ గీతా వందన, కేజీహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్ రాధ, కేజీ హెచ్ పాథాలజిస్ట్ డాక్టర్ టి. కిశోర్, కేజీహెచ్ సోషియాలజిస్ట్ డాక్టర్ శోభశ్రీ, సోషియాలజిస్ట్ ఎల్.వి. రమణి, ఎన్‌జీవో ప్రతినిధి కె. శివాజీ, మానిటరింగ్ కన్సల్టెంట్ డాక్టర్ బి. ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డీఎంఈవో) బి. నాగేశ్వ రరావు తదితరులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మెడికవర్‌లో ఆధునిక కార్డియాక్ సర్జరీ

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్ప త్రిలో అధునాతన మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ (ఎంఐసీఎస్) అందుబాటులోకి తెచ్చినట్లు హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్ వెల్లడించారు. ఇది మిక్స్ సాంప్రదాయ ఓపెన్ హార్ట్ సర్జరీకి భిన్నంగా రోగులకు అందించే ఆధునిక వైద్య పద్ధతని తెలిపారు.

ఇటీవల కాలంలో కరోనరీ ఆర్టరీ వ్యాధి దేశంలో వేగంగా పెరుగుతోందన్నారు. దీని కారణంగా యువతలో సైతం హృదయ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తక్షణమే చికిత్స అవసరమైన పరిస్థితులు రోగులకు ఎక్కువ వుతున్నాయన్నారు. రోనరీ ఆర్టరీ వ్యాధి కారణంగా 100 శాతం బ్లాకేజీతో బాధపడుతున్న రోగులకు మిక్స్ ద్వారా వేగంగా నయం చేయవచ్చన్నారు. ఇటీవల ఎంవీపీ మెడికవర్ హాస్పిటల్‌లో 29 ఏళ్ల యువకుడికి ఈ కొత్త విధానం ద్వారా నయం చేసి నట్లు తెలిపారు. ఈ విధానాన్ని విశాఖలో అందుబా టులోకి తీసుకురావడం పట్ల సీటీవీఎస్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర పాడి మెడికవర్ యాజమాన్యాన్ని అభినందించారు. పలువురు డాక్టర్లు ఈ శస్త్ర చికి త్సలో పాల్గొన్నారు.


శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసుకున్న యువకుడితో మెడికవర్ వైద్యులు

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరవు

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు


పదమూడో వార్డులో షాపు యజమానితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు


జీవీఎంసీ 23వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు

ఆరిలోవ : కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజ కవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపిం చారు. జీవీఎంసీ పదమూడో వార్డులో శుక్రవారం ''బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ'' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెం కట్, స్థానిక నాయకులతో కలిసి మొల్లి అప్పారావు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలను ఏవిధంగా మోసం చేస్తుందో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. శాంతి భద్ర తలను గాలికి వదిలేసి ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధించడంపైనే కూటమి నాయకులు దృష్టి పెట్టార న్నారు. ఎన్నికల సమయంలో 140 హామీలు ఇచ్చి, అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలు చేయకుండా గాలికి వదిలేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చే వరకు నిలదీయాలి

ఎంవీపీ కాలనీ: సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను మోసగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మోసాలపై ప్రచురిం చిన కరపత్రాలు అందరికీ పంపిణీ చేశారు. జీవీఎం సీ 18వ వార్డు పార్టీ అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ ఆధ్వర్యంలో మూలపాలెంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఉమ్మిడి కల్యాణ్ మాట్లా డుతూ ఆచరణ సాధ్యం కాని 140 అబద్ధపు హామీ లతో కూటమి నాయకులు ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దెనెక్కారని ఆరోపించారు. ఏడాదిన్నర పాలనలో రాష్ట్రం అన్ని విధాలా వెనుకబడిపోయింద న్నారు. అక్రమ అరెస్టులు, అరాచకాలు మినహా చం ద్రబాబు ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కూటమి నాయకు లను నిలదీయాలని ప్రజలకు సూచించారు. కార్యక్ర మంలో మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, దివ్యాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బంగారు భవానీ శంకర్, మహిళా విభాగం అధ్య క్షురాలు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కల్యాణ్ తదితరులు

ఆటోడ్రైవర్ల జీవనానికి తీవ్ర అన్యాయం

మద్దిలపాలెం: జీవీఎంసీ 23 వార్డులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం శుక్రవారం మద్దిలపాలెంలో నిర్వహించారు. ఈ సం దర్భంగా వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమ న్వయకర్త మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి చం ద్రబాబు ప్రభుత్వ మోసాలు వివరించారు. ఈ క్రమంలో మద్దిలపాలెం కూడలిలోని రాజరాజేశ్వరి కనక దుర్గా ఆటో స్టాండ్ వద్ద 20 మంది ఆటో డ్రైవర్లను కలిసి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో నష్టపోతున్నామని ఆటో డ్రైవర్లు ఆవే దన వ్యక్తం చేశారు. కన్నీరు పెట్టుకుంటూ రోజుకు కనీసం రూ.250 కూడా ఇంటికి తీసుకెళ్లలేక పోతున్నామని వాపోయారు. పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టలేక పోతున్నామని ఆవదేన వ్యక్తం చేశారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ కూట మి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు తీరని అన్యాయం చేసిందన్నారు. పులగం సూర్యనారాయణ రెడ్డి, బూస రమణా రెడ్డి, బోర కుమార్ రెడ్డి, పులగం శ్రీని వాస్ రెడ్డి, నగిరెడ్ల పోలిశెట్టి, ఎండ్రెడ్ల ఈశ్వర్ రెడ్డి, గుడ్ల గణేష్ రెడ్డి, పిలక మధుసూదన్ రెడ్డి, బోస రమణారెడ్డి, గుడ్ల నర్సింగరావు రెడ్డి, బోయి త్రినాథ్ రెడ్డి, చిల్ల నారాయణరావు, అచ్చి సుధీర్ రెడ్డి, బోయి రమణారెడ్డి, చిల్లా ఎల్లయ్య రెడ్డి, పుట్టా రవణమ్మ, గుడ్ల కైలాష్ రెడ్డి, పిట్ట జగదీష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే అవినీతి అంతం


ఏసీబీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు

ఆరిలోవ: అవినీతి జరగకుండా ప్రజలకు అవగా హన కల్పించాలని కోరుతూ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు శుక్రవారం ఏసీబీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అంతటా ప్రజల్లో అవినీతిపై అవగాహన కల్పించాలని, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని విన తిపత్రంలో పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు బెవర శ్రీనివాస్, జామి శివాజీ, కన్నారావు, మధు, రాజేష్ పాల్గొన్నారు.

వేగంగా మరమ్మతులు చేపట్టాలి

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాడైపోయిన రోడ్లు, కాలు వలకు వేగంగా మరమ్మతులు పూర్తి చేయాలని సం బంధిత అధికారులను జోన్ – 3 కమిషనర్ శివప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన వార్డులో ఆకస్మికంగా పర్యటించారు. వార్డులో వర్షాల వల్ల పేరుకుపోయిన చెత్త తొలగించాలని, రోడ్లు, కాలువలను శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్య దర్శి ముప్పల సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న జోన్ - 3 కమిషనర్ శివప్రసాద్

వ్యక్తిపై కత్తితో దాడి

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఓ వ్యక్తిపై మరో యువకుడు దాడి చేశాడు. దీనిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శ్రీకాంత్‌నగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసముంటున్న బొట్ట పృథ్వీరాజ్ మరదలుతో మేడ ప్రసాద్ అనే యువకుడికి ఇటీవల వివాహం కుదిరింది. అయితే ఆ సంబంధం అనివార్య కారణాల వల్ల రద్దయింది. దీంతో ఆ సంబంధం రద్దవడానికి పృథ్వీరాజే కారణమని భావించిన ప్రసాద్ శుక్రవారం సాయం త్రం ఆయనపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పొడ్డాడు. ఈ సంఘటనలో పృథ్వీరాజ్‌కు వీపుపై గాయమైంది. స్థానికులు కలుగజేసుకోవడం తో అక్కడి నుంచి ప్రసాద్ పరారయ్యాడు. గాయ మైన పృథ్వీరాజ్‌ను ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆరిలోవ ఎస్ఐ కృష్ణ, సిబ్బంది వివరాలు సేకరించారు. దీనిపై పృథ్వీరాజ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ప్రసాద్‌ను కొంత సేపటి తర్వాత అదుపులోకి తీసుకున్నారు.

నిరాశ్రయుల గృహానికి నలుగురి తరలింపు


నిరాశ్రయుల గృహానికి తరలించిన వారితో పోలీసులు

బీచ్‌రోడ్డు: నగరంలో భిక్షాటన చేస్తున్న నలుగురిని నగర పోలీస్ కమిషనర్ శం ఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నిరాశ్రయుల వసతి గృహానికి శుక్రవారం తర లించారు. సంపత్ వినాయక గుడి వద్ద భిక్షాటన చేస్తున్న నలుగురిని గుర్తించి మూడో పట్టణ పోలీసులు వారిని పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గృహానికి తరలించారు.